# కనబడుటలేదు

పద్మశీల

స్కూలుబస్సు టర్మినస్‌లో ఆగింది–సాయంత్రం నాలుగు గంటలకు. అందులోంచి స్కూళ్లకెళ్ళిన పిల్లలంతా దిగారు. రమణ దిగలేదు. అంత దూరంనుంచి ప్రహరీగోడమీదనుంచి రోడ్డుమీదకు చూసిన కృష్ణవేణమ్మ గుండె గతుక్కుమంది.

రమా, భారత్, సుధా–ముగ్గురమ్మాయిలూ తల్లిదగ్గరకు పరుగెత్తుకొచ్చారు! 'తమ్ముడు రాలేదేమమ్మా !' అంటూ.

"ఏమోనే ! వాడికి బస్సు అందలేదేమో ! డాడీ ఆఫీసుకు ఫోన్‌చెయ్!-బాబు రాలేదని. ఆయన వస్తూవస్తూ ఇంటికి తీసుకొస్తారు" అన్నది తల్లి పెద్దమ్మాయితో.

రమ తండ్రి ఆఫీసుకు ఫోన్‌చేసి చెప్పింది-తమ్ముడు స్కూలునుంచి ఇంటికిరాని విషయం. కాని తర్వాత అర గంటకే తండ్రినుంచి ఫోన్ వచ్చింది-అబ్బాయి స్కూలు దగ్గరా లేడని. కృష్ణవేణమ్మకు గాబరా ఎక్కువైంది.

సాయంత్రం ఆరైంది; ఏడైంది; రాత్రి ఎనిమిదైంది. రమణ జాడలేదు. తండ్రి కార్లో ఆ వీధి యీ వీధి, ఆ ఇల్లూ యీ ఇల్లూ నిర్విరామంగా తిరుగుతూనే ఉన్నాడు; ఎంక్వయిరీ చేస్తూనే ఉన్నాడు. కాని అబ్బాయి ఆచూకీ తెలియలేదు.

రాత్రి ఎనిమిదిన్నరకు తండ్రి ఇంటికొచ్చాడు. కృష్ణవేణమ్మ ఘొల్లుమంది. ముగ్గురు ఆడపిల్లలూ బావురుమని ఏడ్చారు. తండ్రి శివరామయ్య జారిపోతూన్న గుండె ధైర్యాన్ని పొదివి పట్టుకొని, భార్యకు ధైర్యాన్ని చెప్పాడు.

"ఎక్కడికో వెళ్ళివుంటాడు లేవే ! రేప్పొద్దున్నకు వాడంతట వాడే వొస్తాళ్ళేవే ! నువ్వు దిగులు పడకు."

కాని ఆ రాత్రి ఆ ఇంట్లో ఎవ్వరూ భోజనాలు చేయలేదు. విషాద వాతావరణంతో ఇల్లంతా నిండిపోయింది.

ఆ మరునాడు రమణ ఇంటికి రాలేదు.

శివరామయ్యా, కృష్ణవేణమ్మా స్కూలుకు వెళ్ళి వాకబు చేశారు. అయితే రమణ జాడల్ని ఎవ్వరూ సరిగ్గా చెప్పలేదు. ఆ సాయంత్రానికి పోలీసు రిపోర్టు ఇచ్చారు. రేడియోలో అనౌన్స్ చేయించారు-గుర్తులుచెప్పి. అయినప్పటికీ రమణ ఆచూకీ తెలియలేదు. రెండ్రోజులు గడిచాయి.

శివరామయ్య ఆఫీసులో సెలవుపెట్టి రమణకోసం గాలిస్తూనే ఉన్నాడు. పిల్లవాడి స్నేహితుల ఇళ్ళన్నీ చుట్టివచ్చాడు. తెల్సినవాళ్ళ ఇళ్ళకు ఫోన్లు చేశాడు. బంధువుల ఇళ్ళకు, ఊళ్ళకు మనుషుల్ని పంపాడు. ప్రయోజనం శూన్యమైంది.

పరిస్థితి అంతుబట్టడంలేదు. రమణ కనిపించకపోవడానికి కారణం కనిపించడంలేదు. ఇంట్లో ఎవరిమీదా అలగలేదు. ఆ రోజు మామూలుగాగాక ఉత్సాహంగా స్కూలుకెళ్ళాడు. స్కూల్లోకూడా ఏ అల్లరీ ఆగం లేకుండా ఉండాడట.

పిల్లల్ని దుండగులు మాయచేసి ఎత్తుకుపోతున్నారనీ, ఆ పిల్లల కళ్ళు పోగొట్టి అడుక్కోవటానికి పంపించి, డబ్బు సంపాయిస్తున్నారనీ, వాళ్ళను దూరప్రదేశాలకు తీసుకెళ్ళి వూడిగాలు చేయిస్తున్నారనీ-ఇలాంటి కథల్ని ఆ నోటా ఆనోటా వింటూ కృష్ణవేణమ్మ తల్లడిల్లిపోతూన్నది. శివరామయ్యలో కూడా ధైర్యం చప్పగా జారిపోగా, దారుణంగా దిగులుపడిపోతున్నాడు. వంశోద్ధారకుడు ఒక్కడే! ముగ్గురాడపిల్లల తర్వాత కలిగిన నలుసు! అభంశుభం ఎరుగని తొమ్మిదేళ్ల పిల్లవాడు!

మూడోనాడు, అన్ని దినపత్రికల్లో రమణ ఫోటోవేసి, 'కనబడుటలేదు' అనే శీర్షికకింద, ఆచూకీ తెలిపినవారికి ఘనంగా బహుమానం ఇవ్వడం జరుగుతుందని ప్రకటించారు.

నాలుగోరోజు ఉదయం ఏడున్నర గంటలకు రమణ ఇంటికొచ్చాడు చిరుదరహాసంతో. అది కలా? నిజమా ? అన్నంత దిగ్భ్రమతో ఇంటిల్లిపాదీ విస్తుపోతూ చూస్తుండిపోయారు.

ఎక్కడికెళ్ళావురా ? ఎక్కడున్నావురా ? ఎందుకెళ్ళావురా ? ఏంజరిగిందిరా?–మొదలైన ప్రశ్నలతో వాణ్ని ఉక్కిరిబిక్కిరి ఎవ్వరూ చేయలేదు. వచ్చాడుగదా అనే సంతోషంతో అందరూ కౌగిలించుకొని, ముద్దులు పెట్టుకొని, ఆనంద బాష్పాలు కార్చారు.

ఆ సాయంత్రం పెద్దక్కయ్యతో అసలు రహస్యం చెప్పాడు రమణ ! ఏంలేదూ ! పేపర్లలో ఫోటో పడాలని నా కోర్కె అక్కయ్యా! అంచేత రెండ్రోజులు కనబడకుండాపోతేడాడీవాళ్లు నా ఫోటో పేపర్లలో వేయించి 'కనబడుటలేదు' అని ప్రకటిస్తారని, ఆ పని చేశాను. నిన్న పేపర్లలో వేయించారుగా. నా ఫోటోను చూసుకొని మురిసిపోయాననుకో! ఇవాళ పొద్దున్నే వచ్చానుగా ! ఈ మూడ్రోజులూ ఓ ఫ్రెండ్ ఇంట్లో ఉన్నాను !

———